# తారుమారు

రచన:
బి. వి. వి. ఆర్. సుబ్బారావు

*

శారద భర్తయింట అడుగుపెట్టి యీనాటికప్పుడే మూడు వసంతాలు గడిచినై. ఈ మూడేండ్ల వైవాహిక జీవితం ఎంతో ప్రశాంతంగా, మధురాతిమధురంగాగడిచింది. వారి అనురాగ దాంపత్యానికి చిహ్నంగా కొద్దినెలల క్రిందటనే వారియింట పసిపాపడుకూడా వెలిశాడు. శారద రూపురేఖలలో రంభ, ఊర్వశి మొదలైన అప్సరసకాంతలతో పోల్చి చెప్పకోతగినంత అపురూపసౌందర్యవతి కాదు....సరికదా 'అందకత్తె' అనే రూపసి కూడా కాదు. కాని అమాయకత దోబూచులాడే, ఆమె ముఖంలో ఒకవిధమైన లక్ష్మీకళ....పవిత్రభావాలు ఉట్టిపడుతూనే వుంటాయి. గృహకృత్యాల్లో ఎంతో ఆసక్తిని చూపుతూ ఇంటిని స్వర్గసీమగా చేసుకుంటూవున్న ఉత్తమ యిల్లాలు శారద. ఆమె పుట్టింది సామాన్య సంసారులయింట. చిన్ననాటనుండి జీవితంలోని కష్టసుఖాలను, ఆటుపోటులను జాగ్రత్తగా అర్థంచేసుకుంటూ పెరిగి పెద్దదయింది. పెద్దచదువులు చదవకపోయినా, అత్యంత లోకజ్ఞానాన్ని కలిగివుండడం ఆమె ఏనాడో చేసుకున్న పూర్వ జన్మ సుకృతం. భర్త సపర్యలకు ఆయనసుఖానికి తన జీవితాన్ని అర్పించి, పతిసేవయే పరమావధి అని తలపోసే ఉత్తమగృహిణి. ఇంతకూ అటువంటి శారదను ధర్మపత్నిగా పొందడం వేణుగోపాలం ఏనాటి తపఃఫలమో మాత్రం చెప్పలేము.

వేణుగోపాలం ఒక కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అతడు బాగా చదువుకున్నవాడేకాక చాలా తెలివైన బుర్ర అనికూడా చెప్పకోవాలి. మనిషి అన్నివేళలలోను చాలా ప్రశాంతంగానే వుంటాడు. కాని అతడిని ఉద్రిక్తుణ్ణిచేసే విషయాలు కొన్ని లేకపోలేదు. 'స్త్రీని'గురించి మాట్లాడే ప్రతిమాటలోను ఆ జాతిమీద ఏదో పగ, తీరని ద్వేషం ఉన్నట్లుగా వ్యక్తమవుతూవుంటుంది. విద్యావతి అయిన స్త్రీ, సిరిసంపదలు గల ఆడది అనే సంగతి ప్రస్తావనకువస్తే చాలు, వారిని అపహాస్యంచేసి గడ్డిపోచక్రింద జమకట్టినట్లు, తీసిపారవేసినట్లు మాట్లాడే సదవకాశాన్ని మాత్రం జారవిడుచుకోడు. అటువంటి సమయములయందు భర్త మాట్లాడే ప్రతిపలుకూ ఓర్పుగా వింటుంది శారద. భర్త ఉద్రేకం చల్లబడింపని గ్రహించగానే మెల్లగా భర్త వాదనలోని మొండితనాన్ని ఖండించి భర్త చేసే నిర్ణయాలు, వెలిబుచ్చే అభిప్రాయాలు ఉదారబుద్ధితోను, సమదృష్టితోను చేసినవి కావని రుజువుచేసేది. భార్యవాదనవిని, చిరునవ్వులుచిందేముఖంతో మా బాగా మాట్లాడావుసుమీ! మళ్లీసారి ఎన్నికలకు నిలబడి శాసనసభా సభ్యత్వానికి పోటీచేసి గెలుద్దుగాని వినే రాణీ! అప్పుడు తప్పక నీకే విజయం !!! అంటూ వేళాకోళం చేసేవాడు వేణుగోపాలం. రోజులు యీవిధంగా దొర్లుకుపోతున్నాయి.

* * *

ఒకరోజు సాయంకాలం వేణుగోపాలం కాలేజీనుండి యింటికి వచ్చి తనగదిలోకి వెళ్ళాడు. గృహకృత్యాల్లో మునిగి, తీయని కంఠంతో, కూనిరాగంతో పాడే శారదపాట వినిపించింది లోపలనుండి. వేణు బట్టలు మార్చుకుని ఏదో ఆలోచించుకుంటూ పడక కుర్చీలో కూర్చున్నాడు. ఇంతలో లోపల చేసుకుంటూవున్నపని ముగించుకుని శారద బైటకు వచ్చింది అప్పటికే కాలేజీనుండి వచ్చి, బట్టలుమార్చుకుని పడకకుర్చీలోవున్న భర్తనుచూసి చిరునవ్వులు వెదజల్లుతూ "ఎప్పుడు వచ్చారు? పిలిచారు కారేం? దొంగలావచ్చి కూర్చున్నారా! కాఫీ తెస్తాను!" అంటూ లోపలికిపోయి ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసి భర్తకు పట్టుకువచ్చింది.

వేణు భార్య అందించిన కాఫీగ్లాసు అందుకుని కొంత కాఫీత్రాగి "ఇదిగో" అంటూ గ్లాసును ఆమె పెదవులకు అందించాడు— 'నాకెందుకు!' మీరు తాగివెయ్యండి! నా కాఫీ అయిందిగా" అంది శారద. "కాదు, ఇది నీకు" అంటూ మిగిలిన కాఫీ భార్యచేత త్రాగించాడు. తరువాత భార్య నుద్దేశించి "రాణీ! ఇన్నాళ్లకు నేకన్న కలలు ఫలించబోతున్నాయి!" అన్నాడు. ఈ మాటలు అంటూవుంటే అతనికళ్లు ఆనందంతో మెరిశాయి. ఆపడకకుర్చీచేతిమీదనే కూర్చుంటూ భర్తముఖంలోకి నవ్వుముఖంతో చూస్తూ "ఏమిటండీ మీరు యిన్నాళ్లు కంటూవున్న కలలు ఏమిటి .... ఫలించడమేమిటి....నాతో చెప్పరూ?" అంది శారద. "ఇదిగో! ఈ ఉత్తరం చూడు" అంటూ ఒకలేఖ భార్య చేతుల్లో పెట్టాడు వేణు.

శారదకళ్ళు ఆతృతగా ఉత్తరంమీద పరుగులుపెట్టాయి. లేఖలోని ఆఖరు వాక్యాలు చూస్తూవుంటే ఆమె మనోభావాలు రకరకాలుగా మారజొచ్చినై. చదవడం ముగించి ప్రశాంతవదనంతో "ఈమె ఎవరు? ఇదివరలో యెప్పుడూ యీ బంధుత్వంసంగతి నాకు చెప్పారుకారేం" అంది. భార్యముఖభావాలు కనిపెట్టి తనలోనే నవ్వుకుంటూ అనురాగముతో ఆమె ముంగురులను సరిదిద్దుతూ "పిచ్చిదానా! ఆమె మనకు బంధువు కాదు. బంధుత్వంలేదు కనుకనే నీకు తెలుసుకొనే అవకాశం, నేను చెప్పవలసిన అవసరం లేకపోయింది. నిజంగా ఆమె మన బంధువైతే ఇంతకాలం తెలియకుండా ఎలా వుంటుంది నేను చెప్పనూ....?" అన్నాడు వేణుగోపాలం. "ఐతే! మరి యీవిడెవరు! ఉత్తరము చదువుతూవుంటే ఎన్నో సంవత్సరాల పరిచయం ఉన్నట్లుగా చనువుగా వ్రాసింది కాదా యేమిటి?" అంది శారద ఖిన్నవదనంతో. "ఓహో! అందుకా యీ కోపం. చూడు ఆమె అంటే నీకు అప్పుడే యీర్ష్య జనిస్తోంది! అలా ఉండవచ్చా! అసలుసంగతి చెపుతాను విను" అంటూ భార్యను బుజ్జగిస్తూ వేణు చెప్పసాగాడు.

"ఈ ఉత్తరంలోని కాంతం నేను కొన్ని సంవత్సరాలక్రిందట కలసి మెలసి చదువుకున్నవాళ్లం. బాల్యావస్థనుండి ఒకచోటనే పెరిగి పెద్దవాళ్లమైనాము. అటువంటి సన్నిహిత సంబంధంవున్న కాంతం యీప్రాంతం వస్తూ నన్ను చూడడానికి మనయింటికి వస్తానని జాబువ్రాయడంలో తప్పు వుందంటావా రాణీ?" అన్నాడు వేణుగోపాలం భార్యముఖంలోకి చూస్తూ. భర్తపలుకులతో తన అజ్ఞానానికి తనలో దాగివున్న సంకుచితభావాలకి అమితంగా సిగ్గుపడి, వెంటనే "క్షమించండి! ఆమె రావడంలో తప్పేముంది. ఆనందంగా ఆహ్వానిద్దాము" అంది అంచులుదాటి ఉత్సాహంతో. ఆక్షణంలోనే నిజానికి కాంతం ఎవరో యీనాటివరకూ శారదకు తెలియకపోయినా,

ఆనందంగా ఆమెను ఆహ్వానించాలని, ఘనంగా మర్యాదచేయాలని, గౌరవించాలని ఏమేమో ఊహించుకోసాగింది. అంతేకాదు సిరిసంపదలుగల స్త్రీని, చదువుకున్న ఆమె దాన్ని భర్త చీటికిమాటకీ విమర్శించడానికి యీ రాబోయే కాంతంకు ఏదో సంబంధం ఇమిడివుంటుందనికూడా తలపోయసాగింది.

రేపటిరోజురాత్రికి కాంతంవస్తుందని విన్న దగ్గరనుండి శారద మనసు మనసులో లేదు. ఇంటిని ఎంతో చక్కగా వుంచాలని, తను, తనయిల్లు, భర్త, బిడ్డ సర్వం ఆమెదృష్టిలో ఉన్నతస్థానాన్ని సంపాదించేటట్లుచేసి ఆమె మెప్పును పొందాలని హృదయారాటం పొందసాగింది. ఆ మరునాడు సాయంకాలం ఇల్లంతా శుభ్రంగా వూడ్పించింది. సామానులన్నీ చాలా నీటుగా సర్దింది స్వయంగా వాటివాటి స్థలాల్లో. మధ్యగదిలోని బల్లమీద టేబిలు క్లాత్‌తీసి యిస్త్రీచేసి టేబిలుమీద వేసింది. ఫ్లవర్‌వేస్ శుభ్రంచేసి తాజాగాకోసిన పువ్వులతోను పచ్చని ఆకులతోను దాన్ని అలంకరించి టేబిలుమీద పెట్టింది. పనిపాటల్లో మునిగివున్న భార్యనుచూసి వేణు చిలిపిగా నవ్వుతూ "రాణీ! పాపం నీవు చాలా హైరాను పడిపోతున్నావు సుమీ! కాని నేను ఒకటి చెపుతాను విను. సిరిసంపదలలో మునిగి, భాగ్యభోగ్యాలకు అలవాటుపడి, సౌధాలలో వసించే కాంతం నిన్ను, నీ యింటిని యీ సామాన్య అలంకరణలను చూసి ఏనాటికీ సంతృప్తి చెందదు" అన్నాడు. శారద భర్తమాటలు వింటూనే "ఐతేమాత్రం ఏమండీ! గృహిణిగా నావిధిని నేను నిర్వర్తించుకుంటున్నాను. ఆవిడగారు ఎలా అనుకున్నా అనుకోనివ్వండి, దానికి మనం ఏంచెయ్యగలం" అంది నవ్వుతూ.

గోడనున్న గడియారం 'టంగ్' మంటూ అరగంటకొట్టి తొమ్మిదిన్నర అయినట్లు చూపుతోంది. శారద, వేణు భోజనాలు ముగించుకుని, కాంతంరాకకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. 'చంటిబాబు' ఉయ్యాలలో పడుకొని నిద్రపోతున్నాడు. వేణుగోపాలానికి ఎలావున్నా శారదకుమాత్రం ఆతృత హెచ్చుకాజొచ్చింది కాంతం గురించి. 'కాంతం ఇంకా రాలేదేమా' అని ఒకటే ఆలోచన. కాలుకాలినపిల్లిలా ఇంట్లోకి వీధిగుమ్మంలోకి తిరుగుతూ క్షణక్షణం తొంగిచూస్తూనేవుంది అతిథి ఆగమనానికి. చీటికి మాటకీ భర్త ముఖంలోకి దొంగచూపులుచూస్తూ అతడి ముఖంవైపు పరికించసాగింది. కాని భర్త ముఖంలో మార్పు యేమీ శారదకు కానరాలేదు. ఆమె మనస్సులో ఎన్నో ఆలోచనలు ముసురుకొని తిరుగుతున్నాయి. 'ఈ కాంతం యెవరై యుండును. నా భర్తకు యీమెకు ఎటువంటి స్నేహంవుందో!' అని ఏమేమో అనుకోసాగింది. ఇంతలో వేణుగోపాలం ఆవలిస్తూ భార్యతో "అప్పుడే పది గంటలు కావస్తోంది. కాంతం ఇక వస్తుందని అనుకోను. ఇక మనం నిద్రపోదామా?" అన్నాడు. వేణు పలికిన 'నిద్రపోదామా' అనే ఆఖరుమాటలకు తాళంవేస్తున్నట్లుగానే వీధిలో మెల్లగా కారుహారన్ మోగింది. హారన్ విని వినగానే ముందు వేణుగోపాలం అతడి వెనుక శారద అతిథిని ఆహ్వానించడానికి వీధిలోకి వచ్చారు. కారులోనుండి క్రిందకు దిగుతూనే కాంతం "కొద్దిగా ఆలస్యమయింది క్షమించాలి" అంటూ ఏమీ ఎరుగనట్లు మధురంగా పలికి వీరి వెంట యింట్లోకి నడిచింది. హాలులో కుర్చీలలో వేణూ....కాంతం కూర్చున్నారు. శారద భర్తపక్కగా నిలబడివుంది కాళీగా వేసివుంచిన కుర్చీని ఆనుకుని.

"ఇక్కడకు వస్తానని వ్రాసిన మాటనే మరచిపోయావేమోనని అనుకున్నాం సుమి" అంటూ వేణూ తనభార్య శారదను చూపుతూ కాంతంతో "కాంతం....ఇదిగో....శారద.... అర్ధాంగి" అని చెప్పాడు నవ్వుతూ. కాంతం శారదముఖంలోకి చూస్తూ "చెల్లీ! మిమ్మల దంపతిని కలుసుకున్నందుకు చాలా ఆనందిస్తున్నాను' అంది. మళ్లీ చనువుగా వేణుతో "గోపూ! నేను యీప్రాంతం రావలసివుంటుందని అనుకున్నప్పుడే మిమ్మలను చూడాలని అనుకున్నాను. మీ సంసారయాత్రలో ఎలా పయనిస్తున్నారో కళ్లారా చూడాలనే కోర్కెయే నన్ను ఇక్కడకు లాక్కువచ్చింది" అంది. "ఊహు! బాగానేవుంది. ఎంతచెట్టుకు అంత గాలి అన్నట్లు బీదవాళ్లు - మధ్యతరగతివాళ్లు కూడా సంసారయాత్రలో వాళ్ళుపడే కష్టసుఖాలతోను, ఆటుపోటులతోను వాళ్లకున్న ఆనందం సంతృప్తి వాళ్లకుంటుంది. కాని భాగ్యవంతులు దానిని అర్థం చేసుకోలేరు" అన్నాడు వేణు కాంతంమాటలకు సమాధానంగా. అతడి కంఠధ్వనియే సమాధానములోని అవహేళనను, ఎత్తిపొడుపును బైట పడవేసింది — అతడిమాటలను వింటూనే అటు కాంతం ఇటు శారదకూడా సిగ్గుపడ్డారు పాపం. శారద భర్తముఖంలోకి చూసి "ఇంటికివచ్చిన అతిథికి ఇదేనా మనమిచ్చే మర్యాద! అటువంటి మాటలనడం మంచిది కాదు" అంటూ హితబోధచేసినట్లు వోరగా చూసింది. తనకళ్ళతోనే భర్తకు ఒక విన్నపాన్ని సమర్పించుకుంది మూగభాషతో.

వేణుమాటలకు దెబ్బతిన్న గుండెలను స్వస్థపరుచుకుంటూ, తేరుకుని కాంతం తనలోని కలవరాన్ని కప్పిపుచ్చుకుంటూ దరహాసవదనంతో "గోపూ! నీలో ఏమి మార్పు కానరావడంలేదు....అప్పుడు ఆరోజుల్లో ఎలా వున్నావో యీనాడూ అంతే! ఇంతకూ నువ్వు అదృష్టవంతుడవు" అంది కాంతం శారద ముఖంలోకికూడా చూస్తూ. భర్తను కాంతం అభినందిస్తూవుంటె శారదబుగ్గలు సిగ్గుతో రక్తరంజితాలైనాయి. "మీరు మమ్మల్ని ఎంతో ప్రేమగా చూడ్డానికి మాయిల్లు వెదుక్కుంటూ వచ్చినందుకు చాలా సంతోషం. మాకోర్కె చెల్లించి రేపటిరోజున యిక్కడనే భోంచేసివెళ్లండి" అంది శారద. ఆ పలుకులలోనే ఆ ఆహ్వానంలోనే మధురత్వం-సహృదయత్వం తొణికిసలాడింది. ఆ క్షణంలోనే కాంతంహృదయం ఆనందసాగరంలో మునిగిపోయింది. కాంతంవదనంలో వింతకాంతులు వక్కసారిగా వెలుగొందినై.

---


## మహా పిత్తరోగ నివారిణి

తలచుట్టుట, శరీరము వేడిగాయుండుట, కండ్లుతిరిగి పడిపోవునట్లుండుట, కంటితో చూచుసామానులు కదలునట్లుండుట, కండ్లు చుట్టుట, నోటిలో నీరూరుట, కాళ్లు చేతులు మంటలు, నోరు చేదుగా యుండుట మొదలగు పిత్తరోగములను పోగొట్టును. రాత్రులయందు కలుగు దుర్‌స్వప్నములను పోగొట్టి నిద్రకలుగచేయును. 40 విధములగు పిత్తరోగములను పోగొట్ట మంచి జీర్ణశక్తి కలుగచేయగలది.

టిన్ను 1-కి రూ. 3—0—0

ధనలక్ష్మి అండ్ కో.,

సౌకారుపేట :: మద్రాసు-1

ఆ ఆనందం వెల్లివిరిసే కనుదోయితోనే "మా గోపూభార్య ఇంతప్రాణానికి ప్రాణంగా వుంటుందని, హృదయానికి బంగారుసంకెళ్లు వేసి ఖైదీగా చేసుకుంటుందని, అనుకుని వుంటే ముందుగానే యిక్కడకు వచ్చివుండే దానిని. రేపు ఉదయమే బయలుదేరి నేను వెళ్లిపోవలసివుంది. లేనిచో మీయింట్లో, యీ స్వర్గసీమలో మీ అందరిమధ్యా ఒకటి రెండు రోజులు హాయిగా కాలక్షేపం చేసివుందును. ఈసారికి మిమ్మల్నందరినీ కళ్లారా చూశాను. నాకదే ఆనందం చెల్లీ! నీ పరిచయం కూడా అయింది. మళ్ళీసారి యిక్కడకు వచ్చినప్పుడు తప్పక వస్తాను! సరేకదా!" అంటూ ఆ దంపతులకు కాంతం విన్నవించుకుంది.

కాంతంమాటలను వింటూనే శారద వంటయింట్లోకి నడిచింది. కాంతం వేణునుద్దేశించి "వేణూ! నువ్వు ధన్యుడవు.... నిజంగా నువ్వు యెప్పుడూ అదృష్టవంతుడవేలే! నాన్నగారికి నువ్వు అంటే ఎంత తీరని అభిమానంవుండేది" అంటూ తండ్రిమాట జ్ఞాపకంచేసుకుంటూ కనుకొనకల్లోచేరే అశ్రువులను అపుకుంటూ "ఎప్పుడూ ఆయనకు నిన్ను మెచ్చుకోవడంలోను, గుణగణాలను మననంచేయడంలోనే సరిపోయేదికదా. భగవంతుడు నీకు తగిన ఇల్లాలిని సమర్పించాడు—శారద నీకు లభ్యంకావడం నీఏనాటి పుణ్యమో చెప్పలేను. మీ గృహము ఇంత శుభ్రతతో .... ప్రశాంతతతో .... హృదయంగమంగా వుండటం అంతా ఆమె చేతిచలువయే! ఇక నా సంగతిచూడు. పెద్దబంగళా నౌకర్లు, చాకర్లు ఎందరుంటేమాత్రం మన శ్శాంతి మృగ్యమైన నిర్జీవభూమియేకదా!" అంది జాలిగాను భారంగాను నిట్టూరుస్తూ—

కాంతంమాటలు విని "అదృష్టానికేముందిలే! ప్రతివాడూ తనకు తానే అదృష్టవంతులమని అనుకోకపోతే జీవితంలో ముందుకు పురోగమించడమే కష్టంకదా! నీకుమాత్రం కొరవడినదేముంది జీవితంలో"' అని అడిగాడు వేణు. "అవును, బైటవాళ్లకు అలాగే వుంటుంది. జీవితంలో నేను ఆశించిన.... సామాన్యత, సరళత .... సంతృప్తి కరువైపోయినై. అసలు మాయిల్లే విలువైన, అందమైన వస్తువులుమాత్రం అమర్చిపెట్టిన ఎగ్జిబిషన్ప్రదేశంలా కనిపిస్తుంది. కాని ప్రశాంతత వెదికినా దొరకదు. అందరు నౌకర్లు, దాసదాసీలు, ఎవరిని చూసినా వంచనా.... మోసం దాగివుంటాయి. ఇంతవాకా ఎందుకు వాళ్ళమధ్య జీవిస్తున్న నేనుకూడా మారివుంటానని చెప్పుకున్నా తప్పులేదు!" అంది కాంతం. "కాంతం! ప్రభాకరం నిన్ను హృదయానికి హృదయంగా ప్రేమించిన దివ్యమూర్తివుండగా నీకేమి కొదువ" అని వేణు అనగానే కాంతం "అవును! ఆయన ప్రేమించారు ప్రేమిస్తున్నారు. ఆయనప్రేమబాట ఆయనదే. సిరిసంపదలతో తులతూగె ఆ యింట నేను కాపురానికి వెళ్ళిన తొలిదినాలలో కారుల్లో యెక్కి తిరగడంలోను, ఆభరణాలు ధరించడంలోను, విలువైన చీరలు సింగారించుకోవడంలోను కొంత ఆనందాన్ని అనుభవించాను. కాలం మెల్లమెల్లగా ముందుకు దొర్లుతూవుంటే రానురాను వాటి మీద నాకే రోత జనించసాగింది. ఎప్పుడూ హడావిడిగా పనివాళ్లతోవుండే మా యిల్లు.... వారానికి ఐదారు రోజులు ఇంటముఖమే చూడక వ్యాపారవ్యవహారాలలో మునిగి ధనార్జనపరులైన మావారు నన్ను పిచ్చెత్తించి వదిలిన విషయాలు. ప్రశాంతవాతావరణం.... మనశ్శాంతి, సహృదయులు కొరవడిన నా జీవితం ఎట్టిదో ఊహించు—ఇక సమాజంలో చనువుగా మసలుకోవడానికైనా నా ఆర్థిక పరిస్థితులు వారిని నన్ను ఒకచోట చేరనీయకుండా మధ్య నిర్మితమై పెట్టనిగోడలు. ఇక ఏ సుఖములేని నా సౌభాగ్యం నా సిరిసంపదలు ఎందుకో అర్థంకాదు. సమాజంలో సామాన్యులు ఒకరితో ఒకరు ఒకరికొకరు తోడుగా స్వేచ్ఛాజీవితాలు దొర్లించి పొందే ఆనందం, అద్దాలబీరువాలలో బంధించబడిన మాలాంటివాళ్ళకు ఏదీ?" అని కాంతం ఇంకా ఏమో అనబోతోంది.

కాంతం ఆఖరిమాటలు వింటూనే శారద లోపలనుండి ఒక పెద్దగాజుప్లేటులో మైసూరుపాకుముక్కలు, కోసిన ఆపిలు పండుముక్కలు, వలచిన బత్తాయితొనలు పట్టుకొనివచ్చింది. వస్తూనే "మీకోసం ప్రత్యేకించి ఏమి చేయలేదులెండి. ఏదో కొద్దిగా ఫలహారమైనాచేస్తే మాకు సంతోషంగా వుంటుంది" అంది శారద. కాంతం గోపూవైపుచూసింది. వెంటనే వేణుగోపాలం కూడా "అవును? కాంతం తీసుకోవాలి తప్పదు!" అన్నాడు చిరునవ్వునవ్వుతూ. "ముగ్గురం తిందాం శారద ప్రేమతో అప్యాయంగా పెట్టినది తినకుండా వుండగలనా" అంటూ కాంతం బల్లమీదకు చేతినిచాపింది. ముగ్గురూ టిఫిన్చేసి కాఫీలుకూడా ముగించుకున్నారు కొద్దిసేపటికే! ఆ సమయంలోనే కావలసినంత లోకాభిరామాయణం నడిచిపోయింది వారిమధ్య. వుండివుండి వేణు తన యెదురుగావున్న తన అర్ధాంగి శారదను, ప్రక్కనేవున్న కాంతాన్ని పరికించి చూస్తూ వారిలో అంతరాలను ఊహించుకోసాగాడు. అసలు బ్రతకడానికి ధనం మూలాధారమేకావచ్చు. అంతమాత్రంచేత అది ఒక్కటి సమకూరినంతలో ఆనందమయజీవితం గడపగలమని చెప్పలేంకదా! స్త్రీకి ప్రేమించి లాలించే పురుషుడు....అతడికి అనుకూలసతి అనురాగవతియైన ఇల్లాలు లేనిరోజున ధనధాన్య కనకవస్తువాహనాలు సుఖాన్ని తెచ్చిపెట్టలేవు" అని అనుకుంటూ వేణు తన భావాలకు రూపొందిన ప్రత్యక్ష నిదర్శనాలుగావున్న శారదను కాంతంను పరికించిచూస్తున్నాడు.

'ఇక కాంతం బయలుదేరాలని అనుకుంది. ఇంతలో ప్రక్కవరండాలో ఉయ్యాలమంచంలో సుఖనిద్రపోతూవున్న చంటివాడు లేచి యేడ్పు ప్రారంభించాడు. శారద గబగబా వెళ్లి బిడ్డనుతీసి చంకబెట్టుకోబోతోంది. ఆమె వెనుకనే అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళిన కాంతం శారదచేతుల్లోని బిడ్డను లాక్కొని యెత్తుకుంది. నిద్రమత్తులో కళ్ళు సరిగా తెరువని ఆ పసివాడు తన చిన్నారిచేతులను ఆమె మెడచుట్టూ చుట్టబెట్టి వక్షస్థలంమీద వాలిపోయాడు. ఆనంద బాష్పాలు కళ్లలో చిందులాడగా కాంతం బిడ్డను గట్టిగా రొమ్ముకు అదుముకుంది. భార్యాభర్తలిద్దరూ కాంతంచేష్టలకు, తీరని కోరికలతో కృంగి కృశిస్తువున్న విషాదపరిస్థితికి సానుభూతిగా చూస్తునిలబడిపోయారు. "వేణూ! యీపసివాడి సంగతి ఇన్నాళ్ళూ తెలియనిచ్చావే కావేం. నా బాబునుగురించి వినిపించావు కాదేం!" అంటూ తన ఆనందోద్రేకాన్ని తనలోనే అణుచుకుంటూ "నా బంగారు బాబును వదిలిపెట్టను తెలుసా. మీకు మరోబిడ్డ కలగగానే యీబాబు నా బాబే యీకొండ నా కొండే....వీణ్ణి నాకిచ్చివెయ్యాలి!" అంటూ పిల్లవాడివంటిమీద ముద్దులవర్షం కురిపించేసింది కాంతం.

శారద నవ్వింది—నవ్వుతూనే "బిడ్డలు ఉమ్మడి ఆస్తులేకదా! బాబును మీ రెప్పుడు తీసుకువెళ్లినా సరే!" అంది. "అబ్బే! నేను సమ్మతించను. బాబులో భాగం మీకెవ్వరికీ లేదు! చెల్లీ, నీ స్నేహపూరితహృదయంతో పాటు కడుపారా కన్నబిడ్డనుకూడా ఆనందంగా అర్పిస్తానని అనే నీహృదయం ఎంతటి విశాలమయినదో కదా!" అంటూ బిడ్డను ఆ దంపతులను వదలి ఇక బయలుదేరడానికి సిద్ధపడింది. "మరి! నేను వెళ్లివస్తాను! మరి సెలవా" అంటూ కాంతం బయలుదేరింది—వేణూ, శారదలు కాంతంను సాగనంపి యింట్లోకి వచ్చారు.

*   *   *

పడకగదిలో శారద భర్త నుద్దేశించి "మీరు యేమైనా అనండి కాని, కాంతం చాలా మంచిమనిషి!" అంది. "ఊహు! పిచ్చిదానా అసలు కథవింటే నీ ఉద్దేశం ఉల్టాసీదా అవుతుంది" అన్నాడు భార్యతల నిమురుతూ. నిర్లక్ష్యంగా నవ్వుతూ వేణూ "ఏమిటి ఆగాథ నాకు చెప్పరూ?" అంటూ గారాంగా గునుస్తు శారద. "ఎందుకు చెప్పను రాణీ! వినుమరి శ్రద్ధగా" అంటూ వేణుగోపాలం చెప్పడం ప్రారంభించాడు. "అవి నావిద్యార్థి దశలోనిరోజులు. కాంతం తండ్రిగారు మంచి పేరు ప్రఖ్యాతిగలిగి ఒక కాలేజీప్రొఫెసరుగా పనిచేస్తుండేవారు. గొప్పమేధావి. అటువంటి వారి శుశ్రూష లభించడం నిజంగా నాఅదృష్టమనే చెప్పాలి. నేను వారింట్లో ఎంతో చనువుగా ఉండేవాణ్ణి. ప్రొఫెసరుగారికీ నేనంటే తగని అభిమానం. కొంచెం మించుమించు యెప్పుడూ వాళ్లింట్లోనే వుండేవాడిని నేను. చాలామంది పైవాళ్లు నన్ను ప్రొఫెసరుగారి కొడుకుగానే అపోహపడేవారు.

రోజులు దొర్లుతున్నై. అనాటికి కాంతంకు పదునాల్గేండ్ల ప్రాయం వుండివుంటుంది. సహజసౌందర్యవతియైన కాంతం ఆ వయసులో ఎలావుండేది నేను చెప్పనక్కరలేదు కదా. ప్రొఫెసరుగారింటికి నాతోపాటే తరుచుగా భాను, ప్రభాకరం అనే నా మిత్రులిద్దరు వస్తు పోతూవుండేవారు. అప్పటికి భాను మెడికల్ కాలేజీలో చేరాడు. ప్రభాకరం తండ్రితోకలసి వ్యాపారవ్యవహారాలు చూసుకోసాగాడు. కాలచక్రం మరినాల్గేండ్లముందుకు దొర్లిపోయింది. కాంతంపెండ్లిసమస్య బైటపడింది. ఆమెపై ఆశతో మూడు జీవాలు తహ తహ లాడిపోతున్నాయి. నేను భాను ప్రభాకరం అని నీకు వేరే చెప్పనక్కర్లేదు.



నాలో నేనుమాత్రం కాంతం ఎప్పటికైనా నాదిగానే అయితీరుతుందని భావించుకొనేవాడిని. ఇంతకూ కాంతంతల్లి అభిరుచులతో కథంతా తారుమారై పూరుకుంది. ఆమె యెప్పుడూ తన కూతురు సిరిసంపదలుగల భాగ్యవంతులింట సర్వసుఖాలు అనుభవించాలని వాంఛించేది. కొద్దో గొప్పోకల ఇంటి ప్రొఫెసరుగారి ఏకైక కుమార్తెఅయిన తన కూతురుకు పెద్దసంబంధం కూర్చాలని తల్లి ఆశయం. ఇక కాంతం మనోభావాలు ఇవీ అని నిర్ధారణచేసుకోగల అవకాశం కాంతం మాలో ఏ ఒక్కరికీ కలుగనీయలేదు? ఆఖరుకు మా యీ ప్రేమరంగంలో విజయం ప్రభాకరానికే అయిపోయింది. విజయం ప్రభాకరం అనే వ్యక్తిదని చెప్పడంకన్నా అతడి వెనుకనున్న సంపత్తుదని చెప్పుకోవడమే మంచిదికదా రాణీ!

నిజానికి ప్రభాకరంతో సంబంధం ప్రొఫెసరుగారికి ఎంతమాత్రం యిష్టమేలేదు. తరుచుగా ఆయన నాతో "నాయనా! ప్రపంచమంతా దురాశాపూరితమై పోయింది. 'సంతృప్తి' అనేది ఏ ఒక్కరిలోను కానరాదు. ఆశాసాగరాలకు చెలియలికట్టలె కానరాదు. కొందరు మితిమీరిన ఆశలవల్లనే కొన్ని జీవితాలకు పూర్తిగా నిరాశమాత్రమే మిగిలిపోతోంది. ఈనగ్న సత్యం ప్రతివారి కళ్లముందూ నిత్యం నాట్యమాడుతూవున్నా ప్రతివాళ్ళూ కళ్ళుమూసుకుని ముందుకు సాగిపోతున్నారు. అమ్మాయికి తగిన వరుడెవరో నాకు తెలుసు. కాని నేటి జగత్తు మంచి మనుషులకన్న డబ్బునే యెక్కువ గౌరవిస్తుంది అని అంటూండేవారు. ఆయన మాటలువిని ఆయన మనోభావాలు పూర్తిగా అర్థంచేసుకున్నాను. అసలు విషయం బైట ఎంతో పేరుప్రఖ్యాతిగని, కాలేజీ ఆవరణలో సింహగర్జనలుచేసే ప్రొఫెసరుగారు ఇంట్లో మాత్రం అర్ధాంగి అడుగులకు మడుగులొత్తే పిల్లికూన అంటే ఆశ్చర్యంగానే వుంటుంది. కాంతంకూడా తల్లి స్థిరపరిచిన సంబంధానికి తలవగ్గింది. సుఖజీవితానికి ధనమే అత్యవసరమని తలపోసివుండవచ్చు. మహా వైభవంగా ప్రభాకరంతో కాంతం పరిణయం జరిగింది ఆనాడు. ఆ నూతన దంపతులు కలకత్తా వెళ్లిపోయారు. భానుకూడా కొద్దిరోజులకు సింగపూరుచేరి ప్రాక్టీసు ప్రారంభించి అక్కడనే స్థిరపడిపోయాడు. కాంతంతండ్రిగారి కళ్లముందు మిగిలిందల్లా నేను ఒక్కడినే. కాలచక్రం తనవిధిని నిర్వర్తిస్తోంది.... సంవత్సరాలె దొర్లిపోతున్నాయి.

కొద్దికాలానికే పాపం ప్రొఫెసరుగారుకూడా చనిపోయారు. తరువాత మన వివాహం.... కాలెజీ ఉద్యోగంలో చేరడం....తరువాత కథ అంతా నీకు తెలిసివున్నదేకదా. పాపం నాడు కాంతం; జీవితంలో వెలుగును ఆశించింది కాని....రానురాను ఆమె జీవితాన్ని కీనీడలు చుట్టుముట్టి ఆమెను కలవంపెడుతున్నట్లు కనిపిస్తోంది. అనాటికాంతంలోను నేడు మన ఇంట ఆతిధ్యం స్వీకరించిన కాంతంలోను నాకు ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. ఒక్క సంపదలె జీవనసుఖానికి దారిచూపేవి కావని ప్రేమించి లాలించే సహృదయాలు అత్యవసరమని నేను ఎప్పుడూ అనుకుంటూంటాను. ఇవే కలలు నిత్యం నేకంటూవున్నవి. మొన్న కాంతం వ్రాసిన ఉత్తరం వచ్చింది. దానిలోనే అక్షర అక్షరంకూడా ఆమె ఆవేదనను చాలావరకూ బైటపెట్టాయి. ఆరోజున నేకన్న కలలు ఫలించబోతున్నాయని అన్నానుకదా! నేడు....అంతా....నేను అనుకున్నట్లే జరుగుతున్నట్లు కాంతం నోరారా విన్నాను అంటూ భార్యకు వేణుగోపాలం తనకథను చెప్పడం ముగించుచు "ఇంతకూ ఆమెనుగురించి నీ అభిప్రాయమేమిటి రాణీ" అంటూ భార్యను ప్రశ్నించాడు.

"నేను అభిప్రాయపడడాని కేముందండీ! కాంతం చాలా మంచిమనిషి అని ఇంతకు ముందే చెప్పానుకదా! ఇప్పుడూ అంతే!" అంది శారద. "బాగానేవుంది పిచ్చిపిల్లా! నిజానికి నీవంటి గుణవతి భార్యకావడం నా అదృష్టం! నాభార్యగా ఇంక ఏ ఇతరస్త్రీ అయివున్నా యీ కాంతాన్నిచూసి ఈర్ష్యపొంది నన్ను ఎంత అల్పదృష్టితో చూసి వుండేదోకదా" అన్నాడు వేణుగోపాలం భార్యను వడిలోకి తీసుకుంటూ. "ఆదే వట్టిమాట! ఎవరైతే మాత్రం యీర్ష్య ఎందుకుపడతారు" అంటూ కిలకిల నవ్వుతూ ఆతడి బాహుపంజరంలో వాలిపోయింది. "నిజానికి కాంతానికి నేను ఆ జన్మాంతరం కృతజ్ఞురాలినై వుండాలి" అంది భర్త ముంగురులు సవరించుచు—"ఎందుకు!" అంటూ అడిగాడు వేణు ఆమె పెదవులకు తనపెదవులు చేరుస్తు-"మిమ్మల్ని పెళ్లాడకుండా నాకు వదలిపెట్టినందుకు" అంది శారద—ఆమెమాటలు వింటూనే 'నా శారద దేవతామూర్తి' అని వేణుగోపాలం తనలో తానే అనుకుంటూ మురిసిపోయాడు.

—(ఒక ఆంగ్లరచన ఆధారంతో)